ప్రజాశక్తి
మంగళవారం 1 ఆగస్టు 2023 5
అనంతపురం

రైతుల సంక్షేమానికి పెద్దపీట : మంత్రి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

రైతుల సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట వేశారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం అనంతపురం వారి సహకారంతో పిఎంఎజెవై పథకం ద్వారా రైతులకు ఉచిత విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ వ్యవసాయానికి అదునుగా ఉన్న సమయంలో ప్రభుత్వం విత్తన వేరుశనగను పిఎంఎసెవై ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్ కులాల వారికి వంద శాతం రాయితీతో ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కడప ఉక్కుపై బిజెపిది ద్రోహం

◆బిజెపిని ప్రశ్నంచలేని స్థితిలో వైసిపి, టిడిపి, జనసేన ◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా కడపలో నిర్మించాల్సిన ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని కేంద్రం ప్రకటించడం రాయలసీమ ప్రజలకు తీరని ద్రోహం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వచ్చి, అక్కడ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కేంద్రం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో రాంభూపాల్ మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని ఇన్నాళ్లు రాయలసీమ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తూ వచ్చిందన్నారు. తొమ్మిది సంవత్సరాల పాలన తర్వాత అదివీలుపడదని చెప్పి సీమ ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, రాయలసీమకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. 25వ తేదీన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని వెల్లడించారన్నారు. ఇంత నిసిగ్గుగా పార్లమెంట్‌లో మంత్రి ప్రకటిస్తుంటే 31 మంది పార్లమెంట్ సభ్యులున్న వైఎస్ఆర్‌సిపి, టిడిపి ఎంపీలు బిజెపిని ప్రశ్నించకపోగా బిజెపికి మద్దతుగా అవిశ్వాసతీర్మానంలో ఓట్లు వేసి కేంద్రం పట్ల విశ్వాసాన్ని ప్రకటించాలని నిర్ణయాలు చేశారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్‌కు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని, రాష్ట్ర పునర్ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారన్నారు. కర్నూలులో రాయలసీమ డిక్లరేషన్ జరిపారని, కడపలో రాయలసీమ రణభేరి పేరుతో సభలు నిర్వహించి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు బిజెపి లక్ష్యమని ప్రకటించారని తెలిపారు. కొత్తగా రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పురంధేశ్వరి కడపలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించబోతున్నాం, కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తోందని ప్రకటించిందన్నారు. ఆమె చెప్పిన రెండోవ రోజుకే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కడప ఉక్కు ఏర్పాటు చేయడం సాధ్యం కాదని ప్రకటించారన్నారు.కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం లాభదాయకం కాదని బిజెపి చెబుతోందన్నారు. అలాంటిది ఈ పరిశ్రమను జిందాల్ సంస్థకు ఎందుకు ఇస్తున్నారో చెప్పాలన్నారు. ప్రభుత్వం రంగంలో రాని లాభాలు కార్పొరేట్ సంస్థకు ఎలా లాభాలు వస్తాయని నిలదీశారు. కార్పొరేట్ సంస్థలకు ఉక్కు పరిశ్రమను అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వం నిర్మించాలని, అలా కాదని కార్పొరేట్ సంస్థలకు ఇస్తామంటే సహించేది లేదన్నారు. అనంతరం కలెక్టర్‌ను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ. నల్లప్ప, ఎం. బాలరంగయ్య, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, రామాంజనేయులు, ముష్కిన్, వెంకటనారాయణ, భాస్కర్, నాయకులు ప్రకాష్, వలి, మసూద్, ముత్తుజా, గోపాల్, బాబు, రాజు, మున్నీ, లక్ష్మినర్సమ్మ పాల్గొన్నారు.

ఉద్యానవనానికి తగ్గుతున్న ఊతం

◆ఏటా కేటాయింపుల్లో తగ్గుదల ◆అందులోనూ 60 శాతంలోపే ఖర్చు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా అనంతపురం జిల్లాకు పేరు. ఎందుకంటే ఈ ప్రాంతం అనేక రకాలైన నాణ్యమైన ఉద్యానవన పంటలకు ప్రసిద్ధి. దేశ, విదేశాల్లోనూ ఇక్కడి ఉద్యానవన దిగుబడులకు గిరాకీ ఉంది. ఒక్క పండ్లే కాకుండా, పూలు, కాయగూరలు అన్నింటినీ మంచి డిమాండ్ ఉంటుంది. అటువంటి చోట ఉద్యానవన శాఖలకు కేటాయిస్తున్న నిధులు, చేస్తున్న ఖర్చు ఏటా తగ్గుతూ ఉండటం గమనార్హం. అధిక పెట్టుబడులయ్యే ఈపంటలకు ప్రోత్సహించేందుకు గతంలోనున్న రాయితీలను సైతం ఇప్పుడు తొలగించారు. రైతులే పూర్తి ఖర్చును భరించే పరిస్థితి నెలకొంది. ఇంత కష్టపడి పండించిన పంటలకు ఒక్కోసారి గిట్టుబాటు ధర లేకుండా కూడా పోతోంది.

తగ్గుతున్న ప్రభుత్వ ఊతం

ఉద్యానవన శాఖకు గడిచిన రెండేళ్లుగా చూస్తే బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు తగ్గుతూ వస్తుండటం గమనార్హం. అనంతపురం జిల్లా వరకు చూస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.10.17 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో ఖర్చు చేసింది చూస్తే రూ.6.11 కోట్లు మాత్రమే ఉంది. ఇందులో ప్యాక్ హౌస్‌లు, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ రూమ్స్ ఇవేవి కూడా అనంతపురం జిల్లాలో గతేడాది ఒక్కటీ ఏర్పాటు చేయలేకపోయారు. కాయగూరలు, తీగజాతి పంట పెట్టేందుకు ప్రధానమైన ప్లాస్టిక్ మల్చింగ్ కూడా వెయ్యి హెక్టార్లకు ఇవ్వాల్సి ఉండగా 282 హెక్టార్లకు మాత్రమే ఇచ్చారు. ఇక ఈ ఏడాది రూ.11.18 కోట్లు కేటాయించారు. దీనిలో ఏ మేరకు ఖర్చు చేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇక సత్యసాయి జిల్లాకు వస్తే 2022-23 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.13.32 కోట్లు కేటాయించి కేవలం రూ.3.44 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇక్కడ కూడా కలెటన్ కేంద్రాల ఏర్పాటు రూ.3.30 కోట్లు కేటాయించి రూ.38 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. కోల్డ్ రూమ్స్ కోటి రూపాయలు కేటాయించి నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఇక ఈ ఏడాది రూ.9.27 కోట్లు మాత్రమే కేటాయించి ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపికే పూర్తవలేదు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సహకం అందివ్వాలి
శివారెడ్డి , ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న ఉద్యానవన పంటలకు ప్రభుత్వం వైపు నుంచి మరింత ప్రోత్సహం అందివ్వాలి. గతంలో కొన్ని పంటలకు రాయితీలిచ్చే వారు. ఇప్పుడు అవి అందివ్వడంలేదు. తిరిగి అందివ్వాలి. ఈ పంటలను నిలువ చేసుకునేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజీల నిర్మాణంతోపాటు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టాలి. డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీతో అందివ్వాలి. ఇక్కడి పండ్లకు మంచి గిరాకీ ఉన్న నేపథ్యంలో రైతులకు మరింతగా ప్రోత్సహం అందించి ఆదుకోవాలి.

జిల్లాలో విజయవంతంగా జగనన్న సురక్ష

◆2,47,641 అర్జీలకు పరిష్కారం ◆కలెక్టర్ ఎం.గౌతమి

విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో విజయవంతంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తి చేశామనిజిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో దాదాపు నెల రోజులపాటు నిర్వహించామన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు జగనన్న సురక్ష కార్యక్రమం కింద ఏం చేయబోతున్నాం అన్న విషయాన్ని ప్రజలకు తెలియజేశారన్నారు. ఇందులో ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లకు సంబంధించిన సేవలను అందించినట్లు చెప్పారు. జగన సురక్ష కార్యక్రమం కింద మరో అడుగు ముందుకువేస్తూ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేర్చే ప్రయత్నం జరిగిందన్నారు. ఆ సచివాలయం పరిధిలో సురక్ష కార్యక్రమం కింద నిర్వహించిన క్యాంపులో పరిశీలన పూర్తి చేసి లబ్ధిదారులకు వారి గ్రామంలోనే సర్టిఫికెట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఆయా స్థాయిలో అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద జిల్లాలో 2,51,614 సర్వీస్ రిక్వెస్టులు రాగా, అందులో 2,47,641 అర్జీలకు పరిష్కారం చూపించి అందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశామని చెప్పారు. గతంలో సర్టిఫికెట్ల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లి ఎవరిని కలవాలో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత పరిస్థితి మారిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు కలెక్టర్ కతజ్ఞతలు తెలిపారు.

రెండు ఎకరాల పొలం పట్టాను భారతికి అందిస్తున్న కలెక్టర్ గౌతమి

సాకే భారతికి ప్రభుత్వ సాయం

రెండెకరాల భూమి కేటాయింపు... పట్టా అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూలి పనులు చేస్తూ ఎస్కే యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందిన సాకే భారతికి ప్రభుత్వం ద్వారా సాయం అందించారు. సోమవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శింగనమల మండలం నాగలగుడ్డం గ్రామానికి చెందిన సాకే భారతి కలెక్టర్ ఎం.గౌతమిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు సింగనమల మండలం సోదనపల్లి గ్రామం వద్ద సర్వే నంబర్ 9-12లో రెండు ఎకరాల పొలానికి సంబంధించిన పట్టాను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతి కూలి పని చేస్తూ పిహెచ్‌డి పూర్తి చేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఆమె యువతకు రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. జిల్లా యంత్రాంగం నుంచి సాకే భారతికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో తమ వంతు సాయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు ఎకరాల భూమిని కేటాయించి పట్టాను అందజేశామని చెప్పారు. భారతికి ఉద్యోగ అవకాశం కింద జూనియర్ లెక్చరర్ పోస్ట్‌ను గుర్తించామని, ఎస్‌కెయు పరిధిలోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని, ఆమె ఒప్పుకుంటే ఆ పోస్టుకు ఆమెను నామినేట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, ఆర్డీవో మధుసూదన్, శింగనమల తహశీల్దార్ ఈశ్వరమ్మ, సాకే భారతి భర్త శివప్రసాద్, కూతురు ప్రసూన పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా ఓట్లు తొలగిస్తున్నారు'..

కలెక్టర్‌కు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓట్ల తొలగింపు ఉరవకొండ నియోజకవర్గంలో జరుగుతోందంటూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి సోమవారం నాడు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ వెళ్లి ఓట్ల సర్వే చేపట్టాలని ఆదేశించిందని తెలిపారు. అయితే క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదని విమర్శించారు. బల్క్‌గా డిలీట్ చేసేందుకు సిద్ధపడినట్టు ఆరోపించారు. వైసిపి నాయకులు వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకే కొంత మంది సిబ్బంది ఈ రకంగా చేసేందుకు సిద్ధపడ్డారన్నారు. రెండు రోజుల్లో ఏడు వేల ఓట్లు తొలగించాలని బిఎల్‌ఒలపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. మొదటి దశలో ఇది వరకే ఆరు వేల ఓట్లను తొలగించారని చెప్పారు. ఇప్పుడు ప్రక్షాళన పేరుతో మరిన్ని ఓట్లను తొలగించేందుకు సిద్ధపడినట్టు వివరించారు. ఫామ్ 7 అప్లికేషన్లు రోజుకు పది కూడా తీసుకోకూడదని, అటువంటిది బల్క్‌లో తీసుకుంటున్నారని తెలిపారు. ఓట్ల తొలగింపు, ప్రక్షాళన పై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమిని కోరినట్టు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నట్టు చెప్పారు.

జెఎన్‌టియులో ఇంటిగ్రేటెడ్ కోర్సులు

ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంత జెఎన్‌టియు, స్వీడన్ బ్లేకింగ్ సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులు అమలు చేస్తున్నట్లు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. ఈమేరకు సోమవారం చేపట్టిన అడ్మిషన్ ప్రక్రియలో 12 మంది విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీ.టెక్ కోర్సు మూడు సంవత్సరాలు అనంతపురం జెఎన్‌టియు కళాశాల క్యాంపస్‌లో, ఒక సంవత్సరం విద్యను స్వీడన్ బ్లేకింగ్ యూనివర్సిటీలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీ.టెక్ డిగ్రీని అనంతపురం జెఎన్‌టియు, బిఎస్ పట్టాను బ్లెకింగ్ వర్శిటీ (స్వీడన్) ప్రదానం చేస్తుందన్నారు. తర్వాత ఎంఎస్ (మాస్టర్స్) ప్రోగ్రాంను స్వీడన్ బ్లేకింగ్ యూనివర్సిటీ చేయవచ్చన్నారు. విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఇక్కడ విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు పి.సుజాత, ఆర్.కిరణ్మయి, వేల్పుల గురుదత్, జి.ఫణిశేఖర్ (బి.టి.హెచ్, స్వీడన్), ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సు విద్యార్థులతో విసి రంగజనార్ధన

ముగిసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నార్పల

కుళ్లాయిస్వామి చివరిదర్శనం

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తులతో గూగూడు కిక్కరిసిపోయింది. కుళ్లాయిస్వామిని చూడగానే భక్తులు పెద్దఎత్తున కుళ్లాయి స్వామి గోవిందా.. గోవిందా.. నామస్మరణతో మార్మోగిపోయింది. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం రాత్రి సమయంలో భక్తులకు తిరుగు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ నార్పల వరకూ రోడ్లపై పోలీసులను పెట్టి కట్టడి చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బంది ఆలయ కార్యనిర్వహణ అధికారిణి శోభ, కుళ్లాయిస్వామి పాలకమండలి ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, ముజావర్ హుస్సేనప్ప ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

బిజెపి తోకపార్టీలతో రాష్ట్రాభివృద్ధికి విఘాతం

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ 2014లో టిడిపి, బిజెపి పార్టీలు కడపలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేసి లక్ష మందికి ఉగ్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతోపాటు మూడుసార్లు శంకుస్థాపన చేసి మోసం చేశారన్నారు. ఈనేపథ్యంలో తొమ్మిదేళ్లు గడిచిన తర్వాత కేంద్ర గనుల శాఖ మంత్రి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేదంటూ రాతపూర్వకంగా ఇవ్వడం దారుణమన్నారు. ఈ ప్రకటనతో లక్షలాదిమంది నిరుద్యోగుల్లో చీకటి అలుముకుందన్నారు. రాయలసీమకు ఇంత అన్యాయం జరుగుతుంటే టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు కేంద్రాన్ని నిలదీయడం మాని కేంద్రం చెబుతున్నట్లుగా తోకలు ఊపుతున్నాయని విమర్శించారు. స్వయానా సిఎం సొంత జిల్లాలో ఇలా జరుగుతున్నా జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇకపోతే వేలాది టిఎంసిల నీరు సముద్రం పాలవుతున్న రాయలసీమలో సాగునీటికి కృషి చేయడం లేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో బంగారు, వజ్రాలు, ముడి ఇనుము, గ్రానైట్, సున్నపురాయి తదితర గనులు పుష్కలంగా ఉన్న ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమ కూడా లేకపోవడం చూస్తే పాలకుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి కార్పొరేట్, ప్రయివేట్ సంస్థలకు ఊడిగం చేసే ప్రభుత్వాలను నిలదీసి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఓ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు జగ్గలి రమేష్, మారుతీప్రసాద్, బి.తిమ్మప్ప, కసాపురం రమేష్, కరెంటు బాషా, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు

సింగనగుట్ల వద్ద పేరూరు పిల్ల కాలువను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన నిమిత్తం ఈ నెల 3వ తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్న మాజీ ముఖ్యంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను టిడిపి నాయకులు పరిశీలించారు. సోమవారం ఉదయం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారధి, మాజీ మంత్రి పరిటాల సునీత తదితరులు ఆత్మకూరు పరిధిలోని పేరూరు డ్యాం పిల్ల కాలువలను పరిశీలించారు. ఆత్మకూరు మండల కేంద్రానికి సమీపంలోని సింగనగుట్ట దగ్గర గత టిడిపి ప్రభుత్వం హయాంలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు రిజర్వాయర్‌కు నీరందించే కాల్వ రెండవ లిఫ్ట్ దగ్గర ఆగిపోయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఈ కాలవ పనులు నిలిచిపోయాయన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు సీఎం జగన్ ఒక గ్రహణంలా పట్టుకున్నారని విమర్శించారు. నాలుగేళ్లలో కనీసం ఒక్క అడుగు కూడా సాగునీటి కాలువ పనులు చేయించలేదన్నారు. ముఖ్యమంత్రి, వైసిపి మంత్రులు కేవలం మాటలకే పరిమితమయ్యారని ఆరోపించారు. టిడిపి హయాంలో పనులు కేటాయించడమే కాకుండా భూసేకరణ చాలా వరకు పూర్తి చేసినట్లు వివరించారు. కొంతమంది రైతులకు పరిహారం కూడా చెల్లించామని తెలిపారు. వైసిపి అధికారంలోకి రావడంతో ఈ పనులకు గ్రహణం పట్టుకుందన్నారు. రైతులకు పరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించి ఉంటే ఈపాటికి పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే పనులు పూర్తయ్యి, వేలాది ఎకరాలు సాగులోకి వచ్చేవన్నారు. కానీ వాటికి ఏమాత్రం నిధులు కేటాయించకుండా ఆర్భాటపు ప్రకటనలకే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం అయ్యిందని మండిపడ్డారు. రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సాగునీటిని అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామంటూ నాలుగేళ్లుగా చెబుతున్నారని, కానీ ఒక్క ఎకరానికి కూడా నీరు ఇచ్చింది లేదన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయడానికే తమ అధినేత చంద్రబాబు సీమసాగునీటి ప్రాజెక్టుల పర్యటన చేస్తున్నారని చెప్పారు. రైతులు, టిడిపి శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్.నారాయణ చౌదరి, శశాంక్ బాబు, ఓబుళపతి, మండల నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-గుత్తి

న్యాయవాది విఠల్‌బాబు హత్యను నిరసిస్తూ సోమవారం గుత్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అద్దంకి కోర్టులో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న విఠల్‌బాబును కొందరు దుండగులు హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు అధికమయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందన (గ్రీవెన్స్‌)సెల్‌లో కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 4/ 7ఎ, 4/7బి, 4/ 8ఎ, 8బిలో గల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు అక్కడ గుడిసెలు వేసుకున్న ప్రజల ఆధార్ కార్డ్, రేషన్ కార్డు పరిశీలించి వారికి ఎక్కడ ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేవని నిర్ధారించడాని తెలిపారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న ఆర్‌డిఓను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యారంగ పరిరక్షణ కోసం ఆగస్టు 8, 9వ తేదీల్లో పట్టణంలో నిర్వహించనున్న జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లీనరీకి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుంతకల్లు వేదికగా జిల్లా ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లీనరీలో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్రంలో 3, 4, 5 తరగతులు ఉన్న పాఠశాలలు మూసివేస్తున్నారన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కార మార్గాలు, ఆందోళనలపై ప్లీనరీలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకీ, చందు, శివ, విజయ్, యశ్వంత్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమకు 'కాపు' చేసింది శూన్యం

సెల్ఫీ ఛాలెంజ్‌లో కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి చేసింది శూన్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. టిడిపి హయాంలో 74-ఉడేగోళం సమీపంలో నిర్మించిన అపెరల్ పార్క్ వద్ద సోమవారం కాలవ 16వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలు పైగా దుస్తుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నాయన్నారు. గార్మెంట్స్ కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తాను పార్లమెంట్ సభ్యుడిగా 2003లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాయదుర్గం, పామిడి పట్టణాల్లో టెక్స్‌టైల్ పార్కులను మంజూరు చేయించానన్నారు. ఆ తరువాత కాంగ్రెస్ పాలనలో కనీసం ఒక్క యూనిట్‌ను కూడా నిర్మించలేదన్నారు. 2014లో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలిచిన తాను కార్మిక, జౌళి శాఖ అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడి 6 యూనిట్ల ఏర్పాటు కు కృషి చేశానన్నారు. 2009-14 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా ఉన్న కాపు అపెరల్ పార్కును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. అలాగే ఈ నాలుగేళ్లలో ఎన్ని యూనిట్లు ఏర్పాటుకు కృషి చేశారో చెప్పాలన్నారు. రాయదుర్గంలో ప్రస్తుతం గార్మెంట్స్ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి టెక్స్‌టైల్ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఊపిరితిత్తులను కాపాడుకోవాలి

సవీరా కన్సల్టెంట్ పల్మనాలజిస్టు సువర్ణ లక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం

ఊపిరితిత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ పల్మోనాజిస్టు సువర్ణలక్ష్మి సూచించారు. సోమవారం అంతర్జాతీయ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో డాక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు దారితీసే వ్యాధుల్లో క్యాన్సర్ రెండవ స్థానంలో ఉందన్నారు. దేశంలో ఎక్కువగా మరణాలకు కారణమయ్యే వాటిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి అన్నారు. పొగతాగడం ఈ వ్యాధికి ప్రధాన కారణమన్నారు. సిగరెట్టు, చుట్టలు, బీడీలను తాగుటవలే కాకుండా వెలువడే పొగను పక్కవాళ్లు పీల్చినా ప్రమాదమే అన్నారు. ఈవ్యాధులతో నిరంతర దగ్గు, ఆయాసం, కఫంలో రక్తం, ఛాతినొప్పి (దగ్గుతున్నప్పుడు), లోతైన శ్వాస తీసుకుంటున్నప్పుడు, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, ఈ క్యాన్సర్ పెరుగుతున్నప్పుడు ఎముకల నొప్పి, తలనొప్పి, ముఖం, మెడ లేదా చేతుల్లో వాపు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, సర్జరీ వంటి చికిత్సలు చేయవలసివుంటున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతి

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి-గుత్తి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలోని మహాత్మగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్, డిఇ మేఘరాజ్, రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి, ప్రజా జీవన గమనానికి విద్యుత్ రంగం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. అలాంటి రంగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పిఆర్‌సి అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు చెల్లించాలని, జూనియర్ లైన్‌మెన్‌ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ ఎఇలు ఎం.శ్రీకుమార్, కె.మధుసూదనరావు, చంద్రశేఖరరావు, లైన్ ఇన్స్‌పెక్టర్లు ప్రహ్లాదాచారి, లక్ష్మీకాంతరెడ్డి, లైన్‌మెన్ తిప్పరాజు పాల్గొన్నారు.

మొహరం వేడుకల్లో మొక్కు చెల్లించిన కాపు, మెట్టు

రాయదుర్గం : మండల పరిధిలోని వేపరాల గ్రామంలో సోమవారం జరిగిన మొహరం వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు నిలువెత్తు బరువుతో చక్కెరను పీర్లకు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గోవిందరెడ్డి కూడా పీర్లకు మొక్కు చెల్లించారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సర్పంచి సనీమా బేగం, ఎంపిటిసి మదీన్, రహిమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు దిలావర్ బాషా, వైస్ సర్పంచి గంగప్ప, ఆనందరెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, దిలీప్ కుమార్, రాము, రామాంజనేయులు, ప్రకాష్ ,శంకర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలను పెయిడ్ ఆర్టిస్టులు అనడం అవమానకరం

టిడిపి బిసి సెల్ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం

ఒంగోలులో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో రాష్ట్రంలో అన్యాయానికి గురైన బాధిత కుటుంబాలు నారా లోకేష్‌కు తమ బాధలను చెప్పుకునేందుకు వెళ్తే పెయిడ్ ఆర్టిస్టులు అనడం బీసీలను అవమానించడమే అని టిడిపి బీసీ సెల్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు టిడిపి బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆలం కృష్ణప్ప, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగనన్న మద్యం తాగి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే బీసీలు మీ అంతు చూస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దలవాయి వెంకటనారాయణ, మంగళ ఆదినారాయణ, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, కురుబ సాధికారత రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, వడ్డెర సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, శాలివాహన రాష్ట్ర కన్వీనర్ మదనప్ప పోతలయ్య, నాయకులు గంగారం బుజ్జి, చేపల హరి, గోపాల్ గౌడ్, కనుమ చౌడప్ప, బండి పరశురాముడు, కొయ్యగూర పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలపై చర్చ లేనప్పుడు సమావేశాలెందుకు..!

గుంతకల్లు కౌన్సిల్ మీట్‌లో ప్రతిపక్ష కౌనిలర్ల నిరసన

గుంతకల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు

అజెండాలోని అంశాలపై చర్చలు జరగలేనప్పుడు ఇక సమావేశాలను ఎందుకు నిర్వహించాలని ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు మండిపడ్డారు. ఈమేరకు పోడియంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా కుక్కల బెడద, పారిశుధ్యం, అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయని వైసిపి కౌన్సిలర్లు విద్యారాణి, నాగరత్న, టిడిపి కౌన్సిలర్లు పవన్ కుమార్‌గౌడ్, కృపాకర్ తదితరులు ఛైర్‌పర్సనతోపాటు కమిషనర్ వి.మల్లికార్జునను నిలదీశారు. దీంతో ఛైర్‌పర్సన్ భవాని సమావేశాన్ని ముగిస్తూ వెళ్లిపోయారు. అవమానంగా భావించిన టిడిపి కౌన్సిలర్లు పోడియం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఛైర్‌పర్సన్, కమిషనర్, వైసిపి కౌన్సిలర్లు బయటికి వెళ్లకుండా మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైకాపా, టిడిపి, సిపిఐ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : తాగునీటి సమస్యపై అధికార పార్టీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు రూపావతి, బి.లక్ష్మీరాణి, ఖాజా ఖాన్, రమణ, వరద మాట్లాడుతూ రోజుల తరబడి తాగునీరు కొళాయిలకు సరఫరా కాకపోవడం వల్ల ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. దీంతోపాటు వార్డుల్లో నెలకొన్న పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మురళీధర్, టిపిఓ మహబూబ్ జాన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, ఎఇ సాయినాథ్ బాబు, టిపిబిఓ తమీమ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

టిడిపి ఆధ్వర్యంలో గుత్తి మున్సిపాలిటీ ముట్టడి

టిడిపి ఆధ్వర్యంలో గుత్తి మున్సిపాలిటీ ముట్టడి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందుగా ఖాళీ బిందెలతో స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ నీదుగా ప్రదర్శనగా వెళ్లారు. అయితే నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోకి వెళ్తుండగా ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ మేనేజర్ మురళీధర్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్‌గౌడ్, టిడిపి మండల పట్టణ కన్వీనర్లు రవిశంకర్‌గౌడ్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు దిల్కా శీనా, సర్పంచి భరత్‌కుమార్, ఎంపిటిసి ధనుంజయ, మాజీ ఎంపిపి వీరేష్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసయాదవ్, టిడిపి జిల్లా కార్యదర్శి పి.శ్రీకాంత్‌చౌదరి, నాయకులు ఎన్.కేశవనాయుడు, ఎంకె.చౌదరి, భాస్కరస్వామి, కె.గోవిందు, ఎస్ఎం.బాషా, అగ్గిరాముడు, కొత్తపేట సూరి, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు దేశానికే ఆదర్శం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

సచివాలయం ప్రారంభోత్సవంలో ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో సిఎం జగనన్న తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు దేశానికి ఆదర్శమని ప్రభుత్వ (విద్య) సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్‌బికె, ఆకులేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, లోలూరులో గ్రామ సచివాలయాలను జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.37 కోట్లతో ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ విల్లేజ్ క్లినిక్‌ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు తెలిపారు. జగన్ సిఎం అయ్యాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపే అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, సర్పంచి నాగ మునెమ్మ, ఎంపిడిఓ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, అగ్రికల్చర్ ఎఒ అన్వేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఎఇ విజయ్‌కుమార్, వైసిపి సీనియర్ నాయకుడు గోవిందరాయునిపేట శివశంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, ఎన్‌వి నారాయణ, గాండ్ల డైరెక్టర్ నరసయ్య, బండి లలిత, ఎంపిఇఓలు రాజారెడ్డి, ఉమా, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల నమోదుపై శిక్షణ

గుంతకల్లు రూరల్ : ఖరీఫ్ సీజన్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుపై సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిఇఓలు, విఆర్‌ఒలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి కె.స్వాతి, తహశీల్దార్ బి.రాము మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా అధికారులతో నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత టెక్ మహీంద్ర సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 28న ప్రారంభమైన ప్రాంగణ నియామకాలకు జిల్లావ్యాప్తంగా దాదాపు 800 మందికిపైగా విద్యార్థులు హాజరుకాగా 144 మందిని ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరితో 73 మంది పీవీకేకే కళాశాల విద్యార్థులు ఉండటం గమనార్హమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, సంస్థ అసోసియేట్ మేనేజర్ ప్రదీప్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనంతపురం : సమాజ హితంలో ముందుండే అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అందించే సేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి దీనబాబు సూచించారు. సోమవారం న్యాయసేవా సదన్ లో సమగ్ర శిశు అభివృద్ధి పథకంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా లోకదాలత్, శాశ్వత లోక్‌అదాలత్, మధ్యవర్తిత్వం, బాల్య వివాహాల నిరోధం, అక్రమ మానవ రవాణా నిరోధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సేవలకు సంబంధించిన గోడపత్రికలను అంగన్‌వాడీ కేంద్ర ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యులు న్యాయవాదులు ఎన్.హరికృష్ణ, జి.పద్మజ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సుబ్రమణ్యం, మిషన్ వాత్సల్య ప్రతినిధి చంద్రకళ, వన్‌స్టాప్ సెంటర్ శాంతామణి, పట్టణ సిడిపిఒ లలిత, రూరల్ సిడిపిఒ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం : కోరమాండల్ ఫర్టిలైజర్ ఇండియా లిమిటెడ్ ఎరువులు సోమవారం జిల్లాలోని ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్ చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.రవి తెలిపారు. ఎరువులను పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి నివేదించినట్లు తెలిపారు.

పుట్లూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని ఏఏ గ్రామాల్లో ఫ్యాక్షన్ ఉంది.. ఏఏ గ్రామాల్లో మట్కా, జూదం ఆడుతున్నారనే విషయాలను సీఐ వేణుగోపాల్, ఇన్‌ఛార్జి ఎస్ఐ రామకృష్ణను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కడా అసాంఘిక కార్యక్రమాలకు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ముఖ్యమైన గ్రామాల్లోని సర్కిళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్కా, జూదంపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం ఎస్.గూడూరులో పర్యటించి ఓ అమ్మాయి విషయంలో గొడవకు దిగిన ఇరువర్గాలతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గ్రామాల్లో కులాల పేరుతో గొడవలు పడకుండా ప్రశాంతంగా జీవించాలని కోరారు. గొడవల జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఉరవకొండ : సిఎం జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ, సాయినగర్‌లో రూ.20లక్షల ఉపాధి హామీ నిధులతోపాటు మరో 10 లక్షల ఎఫ్ఎఫ్సీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నామన్నారు. పట్టణంలోని ప్రతివార్డులో ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చందా చంద్రమ్మ, జడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, నిర్మలమ్మ, కోఅప్షన్ పామిడి సలీమ్, వార్డు సభ్యులు కణేకల్ షహనాజ్, వాసుదేవుడు, ఎంపిటిసి వన్నూరుసాబ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసీఫ్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు మీరం బాషా, నాయకులు ఓబన్న, ఎంసీ నాగభూషణం, గట్టు ఎర్రిస్వామి, మీనుగా ఎర్రిస్వామి, రఫిక్, అన్వర్, వడ్ల సలీమ్, రామాంజనేయులు, ఆటో సీనా, జోగి భీమన్న, అన్నం శేఖర్, యూసుఫ్, అంజి, జగన్నాథ్ పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్లను చేర్చాలని ఆందోళన

బెలుగుప్ప : మండలంలోని వివిధ గ్రామాల్లో తొలగించిన దాదాపు 1400 ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వాలంటర్లు, సచివాలయాల సిబ్బంది సహకారంతో మండల వ్యాప్తంగా 1400 మంది అర్హుల ఓటర్లను తొలగించారని మండిపడ్డారు. వెంటనే వారి ఓట్లను పునరుద్ధరించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు తగ్గుపర్తి రాధాకృష్ణ, పెద్ద తిప్పయ్య, రామ్మోహన్, నరిగన్న, అంగడి శ్రీరాములు, నారాయణస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన బైక్ ర్యాలీ

ఉరవకొండ : రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 'జన ఘోష-జనసేన భరోసా' ప్రారంభోత్సవం సందర్భంగా జనసేన నాయకులు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అచ్చునాల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పార్టీ చేసిన కార్యక్రమాలతోపాటు చేయబోయే భవిష్యత్ కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఉరవకొండ, విడపనకల్, మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, గోపాల్, ఉపాధ్యక్షుడు హరిశంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, గణేష్, ఆంజినేయులు, కార్యదర్శి సూర్యనాయక్, నాయకులు దేవేంద్ర, నరేంద్ర, భోగేష్, మణి, మహేష్, భద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

గార్లదిన్నె : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో కులం పేరుతో దూషించిన కేసులో ఈనెల 24న నమోదైన అట్రాసిటీ కేసుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డిఎస్‌పి ఆంథోని సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కులం పేరుతో దూషించిన సూర్యచంద్రారెడ్డితోపాటు బాధితురాలు నాగలక్ష్మిని విచారించారు. దీనిపై పూర్తి విచారణ తర్వాత చర్యలు చేపడతామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

జాతీయ నాసాకు శ్రీచైతన్య విద్యార్థులు

అనంతపురం : జాతీయ స్థాయి నాసా కార్యక్రమానికి నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య విద్యార్థులు ఎంపికైనట్లు ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం మొమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో మానవుడు నివసించడానికి ఉన్న అవకాశాలను పరిశోధన ద్వారా తెలుసుకుని నిర్ధారణ చేసుకోవచ్చని శ్రీచైతన్య విద్యార్థులు ప్రాజెక్టు ద్వారా చేసి చూపించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులు అమెరికాలో జరిగే 192 దేశాల ప్రతినిధుల మధ్యలో ఈ ప్రాజెక్టు గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబుస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాసా మెంటర్ సతీష్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఎఒ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో బికెఎస్ విద్యార్థిని

బుక్కరాయసముద్రం : స్పెయిన్‌కు చెందిన జావుమా నేతృత్వంలోని ఎగాలా క్లబ్ స్పెయిన్ కోచ్‌లు, ఆర్డీటీ సంయుక్తంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు పీడీ గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఆదివారం అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఇండోర్‌స్టేడియంలో జిల్లాస్థాయి అండర్-12, మిక్స్‌డ్ జెండర్, అండర్-16 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో బుక్కరాయసముద్రం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చరిత పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. దీంతో విద్యార్థినిని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శారద, లలిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మృతుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ

అనంతపురం క్రైం : ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇటీవల మృతిచెందిన ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలకు రూ.2 లక్షల చెక్కులను అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి సోమవారం అందజేశారు. వివరాల మేరకు.. ఎఎస్ఐ వెంకయ్య, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతి చెందారు. ఈ కుటుంబాలకు కార్పస్ ఫండ్ కింద చెరో రూ.1 లక్ష ప్రకారం చెక్కులను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనా అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

అనంతపురం క్రైం : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈశ్వరరెడ్డి ఆదేశాలతో లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి పెట్రోలు బంకుల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం నగరం, రుద్రంపేట, తాడిపత్రిలోని పెట్రోలు బంకులను తనిఖీ చేసి పెట్రోలు, డీజిల్ నాణ్యత, కొలతలను పరిశీలించారు. అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో కూడా సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు పొంది, నిబంధనల మేరకు వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఫిల్లింగ్ స్టేషన్లను నిర్వహించాలని అధికారులు సూచించారు.

వాలంటీర్ల కుటుంబాలకు ఆర్థికసాయం

అనంతపురం : నగరంలో పని చేస్తున్న ఇద్దరు వాలంటీర్లు ఆకస్మికంగా మృతిచెందగా వారి కుటుంబాలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఆర్థికసాయం చేశారు. నగరంలోని 23వ డివిజన్‌లో ఉన్న 42వ సచివాలయ పరిధిలో పని చేస్తున్న వాలంటీర్ జహరాబి జూలై 20న ఆకస్మికంగా మృతిచెందింది. అదేవిధంగా 35వ డివిజన్‌లోని 52వ సచివాలయం పరిధిలో పని చేస్తున్న ప్రశాంతి సోమవారం మృతిచెందింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనంత సిఎం దృష్టికి తీసుకెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఆయా కుటుంబాలకు రూ.5లక్షలు అందజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

అనంతపురం క్రైం : విలేజ్ హెల్త్ క్లినిక్ (విహెచ్ఎస్)కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సర్పంచి గార్లదిన్నె కృష్ణయ్య సూచించారు. సోమవారం రూరల్ పరిధిలోని కక్కలపల్లి విహెచ్ఎస్‌లో తన సొంత నిధులతో కొన్న రూ.15 వేల విలువజేసే మందులను వైద్యసిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిన్న జబ్బుకైనా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీహెచ్సీలను ఏర్పాటు చేయడం ద్వారా పలు రకాల జబ్బులను ప్రాథమికంగా నిర్ధారించడంతోపాటు అవసరమైన మందులను కూడా అందిస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కాబట్టి మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రమేష్, గౌరి, ఎఎన్ఎం శారద, ఆశాలు విజయ, చంద్రకళ, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు రుమాళ్ల హరనాథ్ కుమారుడు శ్రీదీప్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కవిన్ ఆదిత్య, సభ్యులు సుబ్రమణ్యం, సుబ్బారావు, నబిరసూల్, ఓబుళపతి, కిష్టప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

యాడికి : చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు మామిళ్ల నారాయణస్వామి, కోదండరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు పుట్లూరు నరసింహయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయిరెడ్డి, హాజీపీరా, రామాంజనేయులు, మోహన పాల్గొన్నారు.

జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువు

రాయదుర్గం : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని టిడిపి మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కురుబ ప్రశాంతి ఆరోపించారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణంలోని 24 వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపం పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో గ్యాస్ సిలిండర్ ధరలు చూసి మహిళలు బెంబేలెత్తుతున్నారన్నారు. జగన్‌కు మరో ఛాన్స్ ఇవ్వబోమని, రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. స్థానిక మహిళలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, రవి, నాగయ్య, ముదిగల్లు జ్యోతి, వెంకటేశులు, సుమలత, ఉమ, వెంకటేశులు, ఇనాయత్, తిప్పయ్య, ధనార్జున, తిప్పేస్వామి, రామంజి, రఘు, సత్తి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

రాయదుర్గం : పట్టణంలో జులై 27వ తేదీ భవన నిర్మాణ కార్మికుడు సునీల్(26) పని చేస్తున్న ప్రదేశంలో ప్రమాదవశాత్తూ విద్యుత్తు వైర్లు తాకి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో రాష్ట్ర తెలుగు యువత నాయకుడు బోయపాటి మురళి మిత్ర బృందం సోమవారం వారింటికి వెళ్లి సునీల్ తల్లికి రూ. 9,650 విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు.

పోక్సో కేసు నమోదు

అనంతపురం క్రైం : మైనర్ బాలికను తీసుకెళ్లిన కేసులో ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లికి చెందిన సతీష్ జులాయిగా తిరుగుతుండేవాడు. అదే సమయంలో స్థానిక నవోదయ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి వారం రోజుల క్రితం తీసుకెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సోమవారం నవోదయ కాలనీ సమీపంలో సతీష్‌తోపాటు బాలికను సైతం పట్టుకున్నారు. బాలికను సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన హోమ్‌కు పంపి సతీష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.